తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
01 అక్టోబర్ 2026

## మున్సిపల్ సమావేశంలో జర్నలిస్టులకు అవమానం!

- బయటికి వెళ్లాలని కమిషనర్ ఆదేశం..
- పిలిచి అవమానించారని జర్నలిస్టుల ఆగ్రహం




**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** వనపర్తి మున్సిపల్ సమావేశాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన జర్నలిస్టులకు బుధవారం ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. సమావేశం నిర్వహించనున్నట్లు మంగళవారం మున్సిపల్ వాట్సాప్ గ్రూపులో సమాచారం ఇవ్వడంతో ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. అయితే సమావేశం ప్రారంభానికి ముందు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ మైక్ ద్వారా జర్నలిస్టులు బయటకు వెళ్లాలని, సమావేశానికి అనుమతి లేదని ఆదేశించారు.

దీంతో జర్నలిస్టులు కమిషనర్‌ను కలిసి తమకు సమావేశం గురించి సమాచారం ఇచ్చి, అనంతరం బయటకు వెళ్లాలని చెప్పడం అవమానకరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ జర్నలిస్టులను సమావేశానికి రావాలని పిలవలేదని, సమావేశం జరుగుతుందనే విషయాన్ని తెలియజేయడానికి మాత్రమే వాట్సాప్ గ్రూపులో సమాచారం ఇచ్చామని తెలిపారు. సమావేశం అనంతరం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

**పిలిచి అవమానించడమెందుకు?**

సమావేశానికి రావాలని సమాచారం ఇచ్చిన తర్వాత అక్కడికి వచ్చిన



జర్నలిస్టులను బయటకు పంపడం ఎందుకని వారు ప్రశ్నించారు. మీడియాకు సమావేశంలో అనుమతి లేదనే నిబంధన ఉంటే ముందుగానే స్పష్టం చేయాల్సిందని పేర్కొన్నారు.

**ప్రజలకు సమాచారం అందే హక్కు సంగతేంటి?**

మున్సిపల్ పరిధిలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, అధికారుల పనితీరుకు సంబంధించిన అంశాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని జర్నలిస్టులు తెలిపారు. సమావేశాల్లో చర్చించే అంశాలపై ప్రజలకు సమాచారం అందాల్సిన అవసరం ఉందన్నారు.

**అధికారుల తీరుపై చర్చ**

జర్నలిస్టులతో వ్యవహరించే విధానంపై మున్సిపల్ అధికారులు స్పష్టత ఇవ్వాలని పలువురు కోరారు. సమావేశ నిబంధనలను ముందుగానే తెలియజేసి, మీడియా ప్రతినిధులకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిందని పేర్కొన్నారు.

## రీసర్వేలో లైసెన్స్డ్ సర్వేయర్లకు పిలుపు

- ప్రభుత్వానికి సహకరించాలి..
- ఎకరాకు రూ.60 పారితోషికం: కలెక్టర్ ఆదర్శ్ సురభి





**వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమంలో లైసెన్స్డ్ సర్వేయర్లు భాగస్వాములై సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో లైసెన్స్డ్ సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో రీసర్వే ప్రక్రియ, వారి భాగస్వామ్యంపై పలు సూచనలు చేశారు.

రీసర్వే పనులకు ఎకరాకు రూ.60 చొప్పున పారితోషికం అందిస్తామని, సర్వేయర్లు నైపుణ్యంతో పనిచేస్తే మంచి ఆదాయం పొందే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమానికి సహకరించకుండా నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. రీసర్వే ద్వారా సర్వేయర్లకు ఉపాధి అవకాశాలతో పాటు సాంకేతిక, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, సర్వే శాఖ ఏడీ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

## సిర్గాపూర్, కంగ్టి సర్కిల్ కార్యాలయాల తనిఖీ





**నారాయణఖేడ్, సెప్టెంబర్ 30(జనంసాక్షి):** సిర్గాపూర్ పోలీస్ స్టేషన్, కంగ్టి సర్కిల్ కార్యాలయాలను సంగారెడ్డి జిల్లా ఎస్పీ బుధవారం తనిఖీ చేశారు.

స్టేషన్‌లో రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, నిర్వహణను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కంగ్టి సర్కిల్ కార్యాలయంలో పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణ చర్యలపై అధికారులతో సమీక్షించారు. అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

## దోకూరులో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**పాఠశాలలు, అంగన్‌వాడీ, కేజీబీవీలో మౌలిక వసతుల పరిశీలన**




మిగతా 12లో..

**దేవరకద్ర, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** దేవరకద్ర మండలం దోకూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం ఆకస్మికంగా పర్యటించి గ్రామ పంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం కేజీబీవీని సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి సౌకర్యాలను పరిశీలించారు. ముందుగా పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య, హాజరు రిజిస్టర్లతో పాటు ఇతర రికార్డులను పరిశీలించారు.

## జపాన్ పర్యటనకు క్రీడా శాఖ మంత్రి శ్రీహరి

- ఏషియన్ గేమ్స్ నిర్వహణపై అధ్యయనం..
- ఖేలో ఇండియాపై ప్రత్యేక దృష్టి



**మక్తల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** తెలంగాణ క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి బుధవారం జపాన్ పర్యటనకు బయలుదేరారు.

జపాన్‌లో జరుగుతున్న ఏషియన్ గేమ్స్ నిర్వహణ తీరును అధ్యయనం చేయడంతో పాటు, తెలంగాణలో త్వరలో నిర్వహించనున్న ఖేలో ఇండియా క్రీడల కోసం పకడ్బందీ ప్రణాళిక రూపొందించడమే పర్యటన లక్ష్యమని తెలిపారు.

మంత్రి వెంట రాష్ట్ర స్పోర్ట్స్ సెక్రటరీ సోనీ బాలాదేవి, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి వెళ్లారు. ఏషియన్ గేమ్స్‌లో ప్రతిభ చూపుతున్న భారత క్రీడాకారులను మంత్రి అభినందించనున్నారు.

ముఖ్యంగా తెలంగాణకు చెందిన క్రీడాకారిణి చికిత అనపర్తి మహిళల కాంపౌండ్, మిక్స్డ్ కాంపౌండ్ ఆర్చరీ విభాగాల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించినందుకు ఆమెను ప్రత్యేకంగా కలిసి అభినందించనున్నారు. వివిధ దేశాల క్రీడా శాఖ మంత్రుల ఉన్నతస్థాయి సమావేశంలోనూ శ్రీహరి పాల్గొననున్నారు.

మంత్రి పర్యటన సందర్భంగా మక్తల్‌కు చెందిన పలువురు ప్రముఖులు, కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అలుకూరి రవికుమార్, మార్కెట్ డైరెక్టర్ శాలం, మైనారిటీ నాయకులు అస్మద్దీన్, సర్ఫరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవుల హక్కుల కోసం ఉద్యమిద్దాం

- వనపర్తిలో గర్జన సభ.. హాజరైన మందకృష్ణ మాదిగ






**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** దళిత క్రైస్తవుల సమస్యల పరిష్కారం, ఎస్సీ హోదా కోసం ఉద్యమించాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఎన్‌సీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన దళిత క్రైస్తవుల గర్జన మహాసభలో ఆయన మాట్లాడారు. 1950లో జారీ చేసిన రాజ్యాంగ (షెడ్యూల్డ్ కాస్ట్స్) ఆర్డర్‌లోని మతపరమైన నిబంధనలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ఆర్డర్‌ను రాజ్యాంగంలోని ఆర్టికల్ 25కు విరుద్ధంగా తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేలా నిబంధనలను సవరించాలని కోరారు. సిక్కులకు సంబంధించి గతంలో చేసిన సవరణలను ఉదహరిస్తూ, దళిత క్రైస్తవుల విషయంలోనూ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై మందకృష్ణ మాదిగ తీవ్ర విమర్శలు చేశారు. దళిత క్రైస్తవుల హక్కుల విషయంలో ఆ పార్టీ అన్యాయం చేసిందని ఆరోపించారు. ఎస్సీ హోదా సాధించే వరకు పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా హక్కుల కోసం ఉద్యమించాలని క్రైస్తవులకు పిలుపునిచ్చారు. ప్రార్థనలకే పరిమితం కాకుండా హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లే దళితుల హక్కులకు రక్షణ ఉందని పేర్కొంటూ, రాజ్యాంగపరమైన హక్కులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. దళిత క్రైస్తవుల పోరాటానికి తాను అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు దగ్గపాటి విజయరాజు, ఎన్‌సీ జేఏసీ వ్యవస్థాపకుడు మార్టిన్ లూథర్, రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు ఐజాక్, వివిధ దళిత, క్రైస్తవ సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొల్లూరులో ఐదు ఎకరాల్లో మోడల్ మార్కెట్

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక మార్కెట్





**రామచంద్రాపురం, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** రామచంద్రపురం మండలం పరిధిలోని కొల్లూరు ప్రాంతంలో పెరుగుతున్న జనాభా, వాణిజ్య అవసరాలకు అనుగుణంగా ఐదు ఎకరాల విస్తీర్ణంలో మోడల్ మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు.
బుధవారం కొల్లూరులోని సర్వే నంబర్ 203లో మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. భూ సర్వే ప్రక్రియను త్వరగా పూర్తి చేసి అవసరమైన స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సరస్వతికి సూచించారు. ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా సమగ్ర మార్కెట్‌గా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొల్లూరు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.
కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమిరెడ్డి, రాములు గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి




**మునిపల్లి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ఏర్పడిన మండల జేఏసీ, ఎంఈఓ భీంసింగ్‌కు వినతిపత్రం సమర్పించింది. బాహ్య మూల్యాంకనాన్ని వికేంద్రీకరించాలని, ఉపాధ్యాయుల పని సర్దుబాటును త్వరగా పూర్తి చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులపై పెరుగుతున్న ఆన్‌లైన్, సమాచార నమోదు వంటి బోధనేతర పనిభారాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు నిర్వహించాలని కోరారు. ఉపాధ్యాయులకు అనుకూల పని వాతావరణం కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అధికారులు సహకరించాలని జేఏసీ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్, టీపీటీఎఫ్, టీపీయూఎస్, యూటీఎఫ్, ఎస్టీయూ, ఎస్సీ,ఎస్టీ సంఘాంప్రతినిధులు పాల్గొన్నారు.

## చందమ్మకోట సుందరీకరణకు తొలి అడుగులు



**చిన్న శంకరంపేట్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మండలంలోని చందంపేట గ్రామంలో పురాతన చందమ్మకోట సుందరీకరణకు తొలి అడుగులు పడ్డాయి. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశాల మేరకు పురాతన కట్టడాల సంరక్షణలో భాగంగా డెక్కన్ టెర్రా, హెరిటేజ్ సంస్థ ప్రతినిధులు బుధవారం గడికోటను పరిశీలించి చుట్టూ కొలతలు సేకరించారు. సుందరీకరణ, అభివృద్ధి పనులకు అవసరమైన వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మీర్కన్, డాక్టర్ మంజుల, జైఇకల్, నైనాషాహరీ, జనాత్‌తో పాటు సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## తేనెటీగల పెంపకంతో అధిక లాభాలు







**తూప్రాన్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం పొందవచ్చని మల్కాపూర్ బీ-హబ్ సొసైటీ ఫౌండర్ చైర్మన్ ఇందిరారెడ్డి తెలిపారు. మల్కాపూర్ పంచాయతీ కార్యాలయంలో ఆత్మ ఆధ్వర్యంలో మహిళా రైతులకు నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. తేనెటీగల పెంపకం, తేనె పరిశ్రమ, తేనెతో పాటు ఆరు రకాల ఉప ఉత్పత్తుల ద్వారా ఆదాయం పొందవచ్చని వివరించారు. సేంద్రియ వ్యవసాయం, జీవన ఎరువుల ప్రయోజనాలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి పి. గంగామల్లు మాట్లాడుతూ యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి, నూనెగింజలు, పప్పుదినుసుల పంటలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్, ఉపసర్పంచ్, ఏఈఓలు హరీష్, అభిలాష్‌గౌడ్, ఏటీఎం సింధు, మహిళా రైతులు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లా స్వేరోస్ నూతన కమిటీ ఎన్నిక



**బెజ్జంకి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** స్వేరోస్ ఇంటర్నేషనల్ రాష్ట్ర కమిటీ ఆదేశాలు, డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ సూచనల మేరకు సిద్దిపేట జిల్లా నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోడూరు స్వామి, ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా చంచు సుధాకర్, కోశాధికారిగా బాలస్వామి, అధికార ప్రతినిధిగా రామగళ్ల స్వామి, సహాయ కార్యదర్శిగా గాజుల అనిల్ ఎన్నికయ్యారు. 'అక్షరం-ఆరోగ్యం-ఆర్థికం' సిద్ధాంతాలతో పేద విద్యార్థుల విద్యాభివృద్ధి, సామాజిక మార్పు కోసం కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది.

## కుమార్ కుటుంబానికి ఆర్థిక సాయం



**చిన్న శంకరంపేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మండలంలోని కామారం గ్రామంలో ప్రమాదంలో మృతి చెందిన కుమార్ కుటుంబాన్ని లీలా గ్రూప్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మోహన్ నాయక్ పరామర్శించారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఆయన బుధవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ మండల నాయకులు నరేష్, రవిచంద్, తార్య, మంగ్యా, మోహన్, చందర్, భీమ, మున్యా, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన నీరజ్ దూబే



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** సూరారం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని హెచ్‌డీఎఫ్‌సీ లీడ్ మేనేజర్ నీరజ్ దూబే బుధవారం ప్రారంభించారు. సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ సహకారంతో కేంద్రాన్ని పునరుద్ధరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సివిల్ ప్రాజెక్ట్ లీడ్ సౌత్ అధినేత గౌతమ్ భార్గవ్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌతమ్ భాష, రామాయంపేట సీడీపీఓ స్వరూపరాణి, సూపర్‌వైజర్ అంజమ్మ, సర్పంచ్ చిలుక నాగరాజు, ఉపసర్పంచ్ రాణబోయిన మల్లేశం పాల్గొన్నారు.

## 20 రోజులుగా వీధి దీపాలు బంద్

**కల్హేర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మండలంలోని ఫతేపూర్‌లో 20 రోజులుగా వీధి దీపాలు వెలగక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత ప్రధాన, అంతర్గత వీధులు చీకటిమయంగా మారుతున్నాయి. దీంతో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు రాత్రివేళ బయటకు రావాలంటే భయపడుతున్నారు. పాములు, తేళ్లు, కుక్కల బెడదతోపాటు ప్రమాదాల ముప్పు ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, లైన్‌మెన్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వీధి దీపాలను మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సీఎం సభకు బెజ్జంకి కాంగ్రెస్ శ్రేణులు




**బెజ్జంకి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు బెజ్జంకి మండల కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్, మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు సభకు బయలుదేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గుడెల్లి శ్రీకాంత్, ముక్కిస కవిత, రత్నాకర్‌రెడ్డి, గుర్రాల అనురాధ, బాల నరసింహారెడ్డి, బైరి మానస-రాజేందర్, జెట్టి రమేష్, కుంట హరికృష్ణతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యమ నిరుద్యోగ కళాకారుడి హౌస్ అరెస్ట్



**హవేలీ ఘనపూర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** సాంస్కృతిక సారథిలో ఉద్యోగాల కోసం ఉద్యమిస్తున్న మెదక్ జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం అధ్యక్షుడు గుడాల సత్యనారాయణను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు సర్ధన గ్రామంలోని ఆయన నివాసంలో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గతంలో సాంస్కృతిక సారథిలో 550 ఉద్యోగాలు భర్తీ చేసినప్పటికీ పలువురు అసలైన కళాకారులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి మూడేళ్లు గడిచినా స్పందన లేదన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సత్యనారాయణ అన్నారు.

## ఎంపీడీవో రాజిరెడ్డిని సన్మానించిన జర్నలిస్టులు



**నిజాంపేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** గత రెండున్నర సంవత్సరాలుగా నిజాంపేట మండలంలో ఉత్తమ సేవలు కనబరిచిన ఎంపీడీవో రాజిరెడ్డిని నిజాంపేట జర్నలిస్టులు వీడ్కోలు సభలో సన్మానించారు. జెడ్పిసిఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, డి ఆర్ డి ఏ పిడి శ్రీనివాసరావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వర్షాకాలం కురిసిన భారీ వర్షాలకు ముంపు గ్రామాల ప్రజలకు భరోసా కల్పిస్తూ రాత్రి సమయంలో గ్రామంలో బస చేసిన గొప్ప ఉద్యోగి ఎంపీడీవో రాజిరెడ్డి అని కొనియాడారు. అలాగే ఉద్యోగరీత్యా మండలానికి అనేక సేవలందించారని అన్నారు. కాలం ముగిసిన అనంతరం కుటుంబ జీవితాన్ని సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరు కుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బండారి చంద్రయ్య, దుబాషి సంజీవ్, కుర్మా బాల రాజు, బండారి సిద్ధ రాములు, ఊడెపు శ్రీకాంత్, భైరవరెడ్డి, శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

# మల్లెచెరువు కట్ట అభివృద్ధికి అడుగులు

• మున్సిపల్ ఛైర్పర్సన్ లావణ్య నాగరాజు



**రామాయంపేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని మల్లెచెరువు కట్ట అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు మున్సిపల్ చైర్పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు తెలిపారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సూచనల మేరకు బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కట్టపై 800 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించడంతో పాటు స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బతుకమ్మ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉన్నందున రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పనులు పూర్తయితే రాత్రి వేళల్లోనూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పనులను త్వరగా ప్రారంభించి పది రోజుల్లో నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కోఆప్షన్ సభ్యురాలు చింతల రాధాభవాని యాదగిరి, పట్టణ అధ్యక్షుడు చింతల సప్ప స్వామి, మాజీ కౌన్సిలర్ బుర్ర అనిల్, కాంగ్రెస్ నాయకులు మట్టి యాదగిరి, యూత్ కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# వెల్దండలో అక్రమ మద్యం తయారీపై సంయుక్త దాడులు

• 1,450 లీటర్ల ఎఫ్‌జే వాష్ ధ్వంసం
• 10 లీటర్ల ఐడీ లిక్కర్, 480 కిలోల నల్లబెల్లం స్వాధీనం





**వెల్దండ, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** వెల్దండ మండలంలో అక్రమ మద్యం తయారీపై ఎక్సైజ్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పోచమ్మగడ్డ తండా, సిలోనిబావి తండా ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా తయారు చేస్తున్న 1,450 లీటర్ల ఎఫ్‌జే వాష్‌ను ధ్వంసం చేశారు. అలాగే 10 లీటర్ల ఐడీ లిక్కర్, 480 కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం తయారీకి సంబంధించి ఒకరిని అరెస్టు చేసి ఆరు కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, అసిస్టెంట్ కమిషనర్ మహబూబ్‌నగర్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నాగర్‌కర్నూల్ ఆదేశాల మేరకు ఈ దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ నాగార్జునరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ తిరుపతిరెడ్డి, ఎస్‌టీఎఫ్ సీఐ వెంకటేశ్వర్లు, కల్వకుర్తి ఎస్‌హెచ్‌ఓ కె.రవిచంద్రరెడ్డి, ఎస్ఐ చాంద్‌బీ షేక్‌తో పాటు ఎక్సైజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అక్రమ మద్యం తయారీ, రవాణా, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.
అక్రమ మద్యం నిర్మూలనకు తనిఖీలు, దాడులు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం అక్టోబర్ 2న నిరసన

• 'డిమాండ్ల దినోత్సవం'ను విజయవంతం చేయాలి



**గోపాల్‌పేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమం కోసం ఐజేయూ పిలుపు మేరకు అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా 'డిమాండ్ల దినోత్సవం' నిర్వహించనున్నట్లు టీయూడబ్ల్యూజే–ఐజేయూ గోపాల్‌పేట మండల అధ్యక్షుడు శివప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
తెలంగాణలో జిల్లా కేంద్రాల్లో గాంధీ విగ్రహాల వద్ద నిరసనలు చేపట్టి కలెక్టర్లు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. వనపర్తిలో జరిగే కార్యక్రమానికి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.
మీడియా రంగంలో మార్పులకు అనుగుణంగా నూతన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక జాతీయ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, సేవా నిబంధనలు, వేతనాలు, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన హక్కులను పునరుద్ధరించాలని, కొత్త వేజ్‌బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు, హెల్త్‌కార్డులు, నగదు రహిత వైద్యం కల్పించాలని అన్నారు. అక్రిడిటేషన్, గుర్తింపు కార్డులు, విధి నిర్వహణ సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉండాలి: తహసిల్దార్ ఝాన్సీరాణి



**మల్దకల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** బిజ్వారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం పౌర హక్కుల సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ఝాన్సీరాణి మాట్లాడుతూ ప్రజలంతా కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి జీవించాలని సూచించారు. దేవాలయ ప్రవేశం నిరాకరించడం, రెండు గ్లాసుల పద్ధతి, అంటరానితనం, కులవివక్ష పాటిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో ఎలాంటి విభేదాలు లేకుండా అన్నదమ్ముల్లా జీవించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శైలజ శ్రీనివాస్‌రెడ్డి, జీపీఓ రంగన్న, పంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి, అధికారులు, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆర్అండ్ఆర్ గ్రామాల్లో ఆలయాల నిర్మాణం వేగవంతం చేయాలి

**నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి.. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**






**వనపర్తి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** రేవల్లి మండలంలోని కొంకలపల్లి, బండరావిపాకుల ఆర్అండ్ఆర్ గ్రామాల్లో ఆలయాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు.
బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో ఆయా గ్రామాల ఆర్అండ్ఆర్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆలయాల నిర్మాణానికి సంబంధించి వారి ప్రతిపాదనలను కలెక్టర్ సమీక్షించారు. కమిటీ సభ్యుల ప్రతిపాదనల మేరకు ఆలయాల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేస్తూ, నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఆలయాలను నాణ్యతతో నిర్మించి గ్రామస్తులకు అప్పగించాలని స్పష్టం చేశారు. పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వినోద్ కుమార్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, ఆర్అండ్ఆర్ కమిటీ సభ్యులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌జెండర్ల హక్కులు, రక్షణపై అవగాహన

**ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి: డీఎస్పీ బాలాజీ**



**వనపర్తి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** ట్రాన్స్‌జెండర్లకు చట్టపరంగా కల్పించిన హక్కులు, రక్షణలు, అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థలపై జిల్లా భరోసా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ ఎస్సై అంజాద్ అలీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ హాజరై మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్ ద్వారా అందించే సేవలు, చట్టపరమైన హక్కులు, రక్షణలు, సహాయ వ్యవస్థలపై వివరించారు. సమాజంలో గౌరవం, భద్రతతో జీవించేలా అవసరమైన సహాయాన్ని అందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రజా శాంతి, భద్రతకు భంగం కలిగించే చర్యలకు పాల్పడకుండా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా వ్యవహరించాలని, పోలీసులకు, ఇతర అధికారులకు సహకరించాలని సూచించారు.

# రైతుల సంక్షేమమే ధ్యేయం..సొసైటీ అభివృద్ధే లక్ష్యం

• సింగిల్ విండో అధ్యక్షులు తిమ్మారెడ్డి



**మల్దకల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సింగిల్ విండో కార్యాలయంలో బుధవారం సింగిల్ విండో అధ్యక్షులు శేషంపల్లి తిమ్మారెడ్డి అధ్యక్షతన మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల రుణాలు, సొసైటీ అభివృద్ధి, రైతులకు అందుతున్న సేవలు, గోదాం నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తిమ్మారెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమం, సొసైటీ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులు సొసైటీ ద్వారా పొందిన రుణాలను సకాలంలో చెల్లించి సహకరించాలని కోరారు. రుణాల వసూళ్లు సక్రమంగా జరిగితే సొసైటీ ఆర్థికంగా బలోపేతమై, మరింత మంది రైతులకు రుణ సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. రూ.1.52 కోట్ల మేర రుణ సదుపాయం 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు కొత్తగా రుణాలు పొందిన ఆరుగురు రైతులకు రూ.70 లక్షల మేర రుణాలు అందించినట్లు తిమ్మారెడ్డి తెలిపారు. అలాగే 105 మంది రైతులు పంట రుణాలను రెన్యువల్ చేసుకోగా, వారికి రూ.82 లక్షల మేర రుణాలు అందించినట్లు వెల్లడించారు. కొత్త రుణాలు,పంట రుణాల రెన్యువల్స్ కలిపి మొత్తం రూ.1.52 కోట్ల మేర రుణ సదుపాయం రైతులకు కల్పించినట్లు తెలిపారు. రైతుల వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా రుణ సదుపాయాలను అందుబాటులో ఉంచేందుకు సొసైటీ ద్వారా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రంగన్న, లోక్య నాయక్, రమేష్, విష్ణు, సీఈఓ కిరణ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఇక్రిశాట్‌ను సందర్శించిన ఉప్పునుంతల విద్యార్థులు






**ఉప్పునుంతల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** ఉప్పునుంతల పీఎం శ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు వృత్తి విద్యా అవగాహనలో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని ఇక్రిశాట్‌ను సందర్శించారు. మెట్ట ప్రాంత పంటల సాగు పద్ధతులు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, వాతావరణ మార్పులను తట్టుకునే పంట రకాలు, పరిశోధనా విభాగాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. వ్యవసాయ రంగంలోని వృత్తి, ఉపాధి అవకాశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఇలాంటి సందర్శనలు ఆచరణాత్మక జ్ఞానాన్ని పెంపొందిస్తాయని ప్రధానోపాధ్యాయుడు జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఇక్రిశాట్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ కల్పన, ఉపాధ్యాయులు, వృత్తి విద్యా శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలి





**బిజినేపల్లి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. సామాజిక భద్రతా పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం మండలంలోని నంది వడ్డేమాన్ గ్రామ పోస్టాఫీసును కలెక్టర్ సందర్శించి పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. పింఛన్లు సకాలంలో అందుతున్నాయా, లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు ఎరుకలి బాలమ్మ, దివ్యాంగుల పింఛన్ లబ్ధిదారు మ్యాతరి బుచ్చయ్యతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా బుచ్చయ్య తనకు ప్రభుత్వం నుంచి పింఛన్ అందుతోందని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు వీల్‌చైర్ అందించాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ అర్హతను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉంటే అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోస్టాఫీసు అధికారుల నుంచి పింఛన్ల పంపిణీ వివరాలను సేకరించారు.

కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక భద్రతా పింఛన్లు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు తదితర అర్హులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించి సకాలంలో పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పింఛన్ల పంపిణీలో లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ అర్హులందరికీ ప్రయోజనాలు చేరేలా బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

# ఎఫ్‌పీవో వార్షిక సర్వసభ సమావేశం



**హవేలీఘనపూర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):**తొగిత గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (ఎఫ్‌పీవో) వార్షిక సర్వసభ సమావేశం అధ్యక్షుడు నాయికోటి శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్, డీసీవో పద్మ పాల్గొన్నారు. సేంద్రియ పద్ధతుల్లో ఆరుతడి పంటలు సాగు చేయాలని, వరిపై ఆధారపడకుండా పంటల వైవిధ్యాన్ని పెంచాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ సాగుతో ఆరోగ్యకరమైన పంటలు ఉత్పత్తి చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. 2021లో పది మంది సభ్యులతో ప్రారంభమైన ఎఫ్‌పీవో ప్రస్తుతం 315 మంది సభ్యులకు చేరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏవో బాల్‌రెడ్డి, సర్పంచ్ సౌమ్య శశికాంత్, ఉపసర్పంచ్ కవిత రామ్‌కుమార్ యాదవ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు





**సంగారెడ్డి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** స్వచ్ఛతా హి సేవ-2026లో భాగంగా సంగారెడ్డి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన సూచనలు అందించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఉత్తమ సేవలందించిన 50 మంది కార్మికులకు మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ ప్రశంసా పత్రాలు అందజేశారు. నమస్తే పథకం కింద చెత్త సేకరిస్తున్న స్వచ్ఛ ఆటో కార్మికులకు భద్రతా పరికరాలు, ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. నగర పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణలో కార్మికుల పాత్ర కీలకమని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. వారి ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు సతీష ్‌రెడ్డి, నవాజ్, జాఫర్, జలంధర్, అన్వార్, మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అక్కన్నపేట పీఏసీఎస్‌ను పునరుద్ధరించాలి



**రామాయంపేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** అక్కన్నపేట గ్రామానికి గతంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)ను పునరుద్ధరించాలని కోరుతూ రైతులు మెదక్ డీసీఓకు వినతిపత్రం అందజేశారు. గతంలో అక్కన్నపేట, ఝాన్సీ లింగాపూర్, తోనిగండ్ల గ్రామాలతో ప్రత్యేక పీఏసీఎస్ ఉండేదని తెలిపారు. ప్రస్తుతం రామాయంపేట పీఏసీఎస్‌లో విలీనం చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామంలో భవనం, గోదాము నిర్మాణానికి స్థలం, సుమారు ఎకరం భూమి అందుబాటులో ఉన్నందున సొసైటీని పునరుద్ధరించాలని సర్పంచ్ బక్కయ్యగారి యాదగిరి కోరారు. డీసీఓ సమస్యను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

# 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



**మల్దకల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మండలంలోని పెద్దపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. విద్యుత్‌శాఖ ఏఈ రాజేష్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు సూచనలు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో గ్రామంలో కొంతకాలంగా ఉన్న లోవోల్టేజీ సమస్యలు పరిష్కారమై విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మెన్ మల్లికార్జున్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పంచాయతీ నిధుల వినియోగంపై విచారణ జరపాలి

## పనులు కొంచెం.. ఖర్చులు కొండంత: దండు ప్రశాంత్ తేజ



కొల్చారం, సెప్టెంబర్ 30 (జనం సాక్షి): వరిగుంతం గ్రామపంచాయతీలో నిధుల వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని టీఆర్ఎస్ యువ నాయకుడు దండు ప్రశాంత్ తేజ డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ కుమ్మక్కై పనులు చేపట్టకుండానే చేసినట్లు చూపిస్తూ నిధులు ఖర్చు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

ఆయన వివరాల ప్రకారం.. ఆగస్టు 1న సరస్వతి పేరుతో రూ.1,23,281, ఆగస్టు 4న పుట్లగళ్ల సువర్ణ పేరుతో రూ.1,83,089 డ్రా చేసినట్లు తెలిపారు. ఎల్ఈడీ బల్బుల ఏర్పాటుకు రూ.1,25,721, బల్బులు, క్లాంపులు, వైర్ కొనుగోలు పేరుతో సెప్టెంబర్ 22న రూ.44,900 డ్రా చేసినట్లు పేర్కొన్నారు. మోటార్ రిపేర్, పారిశుద్ధ్య వాహనం డీజిల్, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు, గడ్డి మందు పిచికారీ తదితర పనుల పేరుతో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పుట్లగళ్ల సువర్ణ పేరుపై రూ.1,25,454 డ్రా చేసినట్లు ఆరోపించారు.

పనులు చేపట్టకుండానే తప్పుడు లెక్కలు చూపిస్తూ పంచాయతీ నిధులను ఖర్చు చేస్తున్నారని ప్రశాంత్ తేజ ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రజావాణిలో ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు వరిగుంతం గ్రామాన్ని సందర్శించి నిధుల వినియోగంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కోరారు. ఆరోపణలు వాస్తవమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, పంచాయతీ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

# ఆరుతడి పంటలతో అన్నదాతకు మేలు



**పాపన్నపేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగుచేయాలని కేవీకే తునికి శాస్త్రవేత్త ఉదయ్‌కుమార్, ఏవో శ్రీనివాస రాజు సూచించారు. చీకోడ్‌లో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన శిక్షణలో వారు మాట్లాడారు. ఆరుతడి పంటలతో నీటి వినియోగం తగ్గడంతో పాటు సాగు విస్తీర్ణం, ఆదాయం పెరుగుతాయన్నారు. నూనెగింజలు, పప్పుదినుసులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం, జీవ ఎరువులు, నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దత్తరాజు, సీఈవో ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వ్యాసరచన,చిత్రలేఖనం పోటీలు



**బెజ్జంకి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కే.ప్రసన్న ప్రథమ, డి.వనజ ద్వితీయ, ఎం.సిందూజా తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు స్టడీ చైర్, స్కూల్ బ్యాగ్, కాపర్ వాటర్ బాటిల్ అందజేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, దేశభక్తి, సేవాభావం పెంపొందించేందుకు కార్యక్రమాలు దోహదపడతాయని రాజు అన్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి విద్యార్థులు సామాజిక బాధ్యత, సేవాభావం అలవర్చుకోవాలని సూచించారు.

# ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



**మక్తల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని ప్రశాంతంగా జీవించాలని ఉడిపి పీఠాధిపతులు విద్యాధీశ తీర్థులు అన్నారు. బిజ్వార్‌లోని శ్రీ పడమటి ఆంజనేయ స్వామి ఆలయాన్ని బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధిలో దాతల కృషి అభినందనీయమన్నారు. తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం పీఠాధిపతిని గ్రామస్తులు శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, సర్పంచ్, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పౌర హక్కులపై అవగాహన పెంచుకోవాలి



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ అద్దంకి సునీత సూచించారు. గువ్వలోనిపల్లిలో బుధవారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. కులం, మతం, వర్గం పేరుతో వివక్షకు తావులేకుండా సమానత్వంతో జీవించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, వేధింపులు, దాడులు జరిగితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పౌర హక్కులు, సామాజిక సమానత్వం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ బలరాం నాయక్, సర్పంచ్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 1 నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

- **ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలి: ఎంఈఓ జాకీర్ హుస్సేన్**



**కోహిర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** తెలంగాణలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (ఎస్ఏ-1) పరీక్షలు అక్టోబర్ 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కోహిర్ ఎంఈఓ మహ్మద్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. విద్యార్థులు ముందస్తు ప్రణాళికతో సన్నద్ధమై చివరి నిమిషంలో ఒత్తిడికి గురికాకుండా చూడాలని సూచించారు. ప్రతి సబ్జెక్టుకు కేటాయించిన సమయాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠ్యాంశాలను పునశ్చరణ చేసుకోవాలని, ముఖ్యమైన అంశాలను మరోసారి చదువుకోవాలని తెలిపారు. పరీక్షలకు అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకుని నిర్ణీత సమయానికి పాఠశాలకు చేరుకోవాలన్నారు. ప్రశ్నపత్రాన్ని పూర్తిగా చదివి అర్థం చేసుకున్న తర్వాత సమాధానాలు రాయాలని, ప్రతి ప్రశ్నకు తగిన సమయం కేటాయించుకోవాలని సూచించారు. ప్రశాంతంగా, క్రమశిక్షణతో పరీక్షలు రాస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చున్నారు. పరీక్షల సమయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ కోరారు. ఇంట్లో చదువుకునేందుకు ప్రశాంత వాతావరణం కల్పించడంతో పాటు ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించి పరీక్షలపై భయాన్ని తొలగించి ఆత్మవిశ్వాసం పెంపొందించాలని సూచించారు.

**పరీక్షల షెడ్యూల్:** అక్టోబర్ 1న తెలుగు/ఉర్దూ మాతృభాష, ఇతర భాషలు, 3న రెండో భాష, 5న మొదటి/మూడో భాష, 7న జనరల్ సైన్స్, 8న ఈవీఎస్, సామాజిక అంశాలు, 9న గణితం, ఇతర ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 6న పరీక్ష ఉండదన్నారు. అక్టోబర్ 10 నుంచి 22 వరకు దసరా సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. సెలవుల్లో పుస్తక పఠనం, విజ్ఞానాభివృద్ధి కార్యక్రమాలకు సమయం కేటాయించాలని సూచించారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

**రేవల్లి మండల వ్యవసాయ అధికారి మణిచందర్**



**రేవల్లి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** రేవల్లి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి మణిచందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని న్యూ ఉమామహే శ్వర సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, హకా రేవల్లి దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్‌ను సక్రమంగా నిర్వహించాలని, నిల్వలను రోజువారీగా అప్ డేట్ చేయాలని ఆదేశించారు. అనుమతిలేని ఉత్పత్తులను విక్రయించరాదని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు జారీచేయాలని సూచించారు. దుకాణంలో స్టాక్ వివరాల బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని నిర్వాహకులకు సూచించినట్లు తెలిపారు.

## మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నిక ఏకగ్రీవం



**రాజాపూర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** రంగారెడ్డిగూడ గ్రామ మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నికలు ఎన్నికల అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పాత పాలకవర్గాన్నే ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా యాదగిరి, కార్యదర్శిగా శివకుమార్ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా శ్రీను, శివశంకర్, రాజు, వెంకటేష్, సంజీవ్, చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా మత్స్యశాఖ అధికారి రాధారోహిణి, సర్పంచ్ రేవతి నూతన కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, రాజేష్, రమేష్, సతీష్, రవి, పంచాయతీ కార్యదర్శి కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## పౌర హక్కులపై అవగాహన




**మనోపాడు, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** బుర్డిపాడు గ్రామంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్వో, ఎస్ఐ, ఆర్ఐ, జీపీఓ, శాంతినగర్ సర్పంచ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పౌరుల హక్కులు, చట్టపరమైన రక్షణ, సమానత్వం, సామాజిక న్యాయంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకుని, ఇతరుల హక్కులను గౌరవించాలని అధికారులు సూచించారు. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### రవీంద్ర భారతి
## ముట్టడిలో మెదక్ కళాకారులు



**కొల్చారం, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ముట్టడి కార్యక్రమంలో మెదక్ జిల్లాకు చెందిన ఉద్యమ నిరుద్యోగ కళాకారులు పాల్గొన్నారు. భారీ ర్యాలీగా తరలివెళ్లిన కళాకారులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కార్యక్రమంలో మెదక్ జిల్లాకు చెందిన వరిగుంతం కమ్మరి శేఖర్‌చారి, బద్ధం సుమలత, శ్రీశైలంగౌడ్, భూమయ్య, గుడాల చంద్రశేఖర్, అలారం పాపయ్య, నేనావత్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గోడపై మొలిచి.. మహావృక్షంగా ఎదుగుతున్న రావి చెట్టు



**జడ్చర్ల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని నేతాజీ చౌరస్తా సమీపంలో ఒక పాత గోడపై మొలిచిన రావి చెట్టు ఇటుకల మధ్య వేళ్లను నాటుకుని మహావృక్షంగా ఎదుగుతోంది. ప్రకృతి జీవశక్తికి అద్దం పడుతున్న ఈ దృశ్యం బాటసారులను ఆకట్టుకుంటోంది. అయితే, చెట్టు పెరిగేకొద్దీ గోడ కూలిపోయే ప్రమాదం ఉంది.

## రైతు సంక్షేమమే లక్ష్యం



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** ఉప్పునుంతల పీఏసీఎస్ మహాజన సభ అధ్యక్షుడు మడ్డు నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 29 వరకు ఆర్థిక లావాదేవీలను, అక్టోబర్ 1 నుంచి మార్చి 31 వరకు అంచనా బడ్జెట్‌ను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. రైతుల సంక్షేమం కోసం బ్రీడర్ విత్తనాలు అందించి మండలాన్ని విత్తన కేంద్రంగా అభివృద్ధి చేస్తామని నరేందర్‌రెడ్డి తెలిపారు. బల్క్ మిల్క్ చిల్లింగ్ సెంటర్, డికార్డికేటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. నానో యూరియా వినియోగించాలని, రుణాలు సకాలంలో చెల్లించాలని సూచించారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** ఖరీఫ్ 2026-27 ధాన్యం కొనుగోలు సీజన్ సందర్భంగా జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సన్న రకం ధాన్యాన్ని గుర్తించి, ధృవీకరించేందుకు బిఎస్సి అగ్రికల్చర్ / అగ్రికల్చర్‌లో డిప్లొమా/డిప్లమా ఇన్ డ్రైలాండ్ అగ్రికల్చర్/ డిప్లమా ఇన్ సీడ్ టెక్నాలజీ/ బిఎస్సి బాటని/బీ జెడ్ సి/ అర్హత కలిగిన వ్యక్తుల సేవలు 2 నెలల కాలానికి అవసరమున్నవనీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోల కేంద్రాల సంఖ్య ,అర్హతను పరిగణనలోకి తీసుకుని, అర్హత కలిగిన వ్యక్తుల సేవలు కొరకు జిల్లాస్థాయి కమిటీ తుది నిర్ణయం తీసుకోబడుతుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతలు, అనుభవ వివరాలతో మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సంప్రదించగలరనీ తెలిపారు.

## మాక్ పార్లమెంట్‌లో నవాబ్‌పేట విద్యార్థుల ప్రతిభ



**నవాబ్‌పేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** నవాబ్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రశ్నోత్తరాలు, శూన్యగంట, బిల్లులపై చర్చలను లోక్‌సభ తరహాలో నిర్వహించారు. ప్రధానమంత్రి, మంత్రులు, ప్రతిపక్ష నాయకుల పాత్రలు పోషించిన విద్యార్థులు సమకాలీన అంశాలపై వాడివేడిగా చర్చించారు. స్పీకర్‌గా శ్రీశైలం సభను క్రమశిక్షణతో నడిపి ప్రశంసలు అందుకోగా, ఎంపీగా అక్షిత ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురావడంలో ప్రతిభ చూపింది. ఎంఈఓ నాగ్యా నాయక్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. డీఈఓ విజయలక్ష్మి, ఏఎంఓ శ్రీనివాస్, ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు.. పట్టించుకోని అధికారులు





**నంగునూరు, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మండుతున్న ఎండలకు తోడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలమాకులలో ఒకేరోజు మూడు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా, మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఏఈని కోరినా స్పందించలేదన్నారు. వరదోలు మల్లేశం బావి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అగ్గిరవ్వలు వచ్చి మంటలు వ్యాపించడంతో వరి పంట దెబ్బతిన్నదని తెలిపారు. గతంలోనూ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో గడ్డివాము, డ్రిప్ పైపులు దగ్ధమయ్యాయని చెప్పారు. పొలాల్లోని ఇనుప విద్యుత్ స్తంభాల నుంచి షాక్ వస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించి, ఇనుప స్తంభం స్థానంలో సిమెంట్ స్తంభం ఏర్పాటు చేయాలని మల్లేశం కోరారు.

## ఎల్టీ లైన్ తగిలి ఎద్దు మృతి



**నిజాంపేట్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** నిజాంపేట్ మండలంలోని బల్కంచెల్క తండా గ్రామపంచాయతీ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. మూడ్ తుకారాంకు చెందిన ఎద్దు ఎల్టీ లైన్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. బుధవారం ఉదయం పొలం వద్ద మేతకు తీసుకెళుతుండగా తెగి వేలాడుతున్న ఎల్టీ విద్యుత్ తీగ తగిలి ఎద్దు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ. 85,000 వరకు ఉంటుందని రైతు తెలిపారు. విషయం తెలుసుకున్న వెటర్నరీ డాక్టర్ నారాయణ ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన ఎద్దుకు పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు, లైన్ మెన్ కిషన్ ను వివరణ కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## కుటుంబ కలహాలతో తండ్రిపై దాడి



**చేర్యాల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** కుటుంబ కలహాలతో తండ్రిపై ఇద్దరు కుమారులు, భార్య గొడ్డలితో దాడి చేసిన ఘటన చేర్యాల పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. వడ్డెర కాలనీకి చెందిన బోదాసు రవి (40) మద్యం తాగి భార్యను తరచూ దూషిస్తూ గొడవపడేవాడని పోలీసులు తెలిపారు.
దీంతో అతని ప్రవర్తనతో విసిగిపోయిన భార్య, కుమారులు రవిపై దాడి చేయడంతో భుజం, మోకాలికి తీవ్ర గాయాలయ్యాయి.
రవి తండ్రి మల్లయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గూడ అపూర్వారెడ్డి తెలిపారు.

# రెవెన్యూ డివిజన్‌పై కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య విమర్శలు





**రామాయంపేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** రామాయంపేట రెవెన్యూ డివిజన్ అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య విమర్శలు కొనసాగుతున్నాయి. తాజాగా కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేశారు. పదేళ్ల పాలనలో పట్టణ అభివృద్ధిని విస్మరించారని, డివిజన్ అంశాన్ని కాగితాలకే పరిమితం చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు ఆరోపించారు. నాన్‌వెజ్ మార్కెట్ యార్డు, ఎంఆర్‌ఓ కార్యాలయ పనులు పూర్తికాలేదన్నారు. రామాయంపేట అభివృద్ధికి రూ.100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో డివిజన్ సాధనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సరాఫ్ యాదగిరి మాట్లాడుతూ గతంలో ఇచ్చిన నవోదయ విద్యాలయం, క్రీడా ప్రాంగణం హామీలపై ప్రశ్నలు సంధించారు. ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. బందారు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ కోసం గతంలో ఉద్యమాలు, రాస్తారోకోలు, రిలే నిరాహార దీక్షలు చేపట్టామని, అప్పటి ప్రభుత్వ పెద్దలను కలిసినప్పుడు అవహేళనకు గురయ్యామని ఆరోపించారు. కాగా, డివిజన్ కొనసాగింపుపై బీఆర్ఎస్ మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి కూడా ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# డ్రిప్‌తో దిగుబడి, ఆదాయం పెంపు




**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** సూక్ష్మ నీటి సేద్యంతో నీటి వినియోగాన్ని తగ్గించి పంట దిగుబడి, రైతుల ఆదాయం పెంచుకోవచ్చని నాబార్డ్ జిల్లా అధికారి క్రిష్ణ తేజ అన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వరరావుతో కలిసి చౌటకూరు, కంది, సంగారెడ్డి, సదాశివపేట మండలాల్లో ఆయిల్‌పామ్, చెరుకు తోటలను పరిశీలించారు. డ్రిప్ విధానంతో 20-30 శాతం అదనపు దిగుబడి వస్తోందని, సాగు, కూలీల ఖర్చులు తగ్గినికర ఆదాయం పెరుగుతోందని రైతులు తెలిపారు. తక్కువ నీటితో అధిక ప్రయోజనం పొందేందుకు డ్రిప్ సేద్యాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని క్రిష్ణ తేజ సూచించారు. అర్హులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సోమేశ్వరరావు కోరారు.

## స్పెల్ బీ పోటీల్లో దిగ్వాల్ విద్యార్థికి ప్రథమ బహుమతి



**కోహీర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** పోతిరెడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి స్పెల్ బీ పోటీల్లో దిగ్వాల్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఉస్మాన్ అహ్మద్ అబ్రార్ ప్రథమ బహుమతి సాధించాడు. జిల్లాలోని 44 పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో ఆంగ్ల పదాల స్పెల్లింగ్, ఉచ్ఛారణ, పదజ్ఞానంలో విద్యార్థులు ప్రతిభ చూపారు. ఉస్మాన్ అహ్మద్ అబ్రార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచాడు. డీఈఓ రోహిణి చేతుల మీదుగా ప్రథమ బహుమతి, ప్రశంసా పురస్కారం అందుకున్నాడు. విద్యార్థి విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కోహీర్ ఎంఈఓ ఎం.డి. జాకీర్ హుస్సేన్ హర్షం వ్యక్తం చేశారు. విజయానికి కృషి చేసిన ఆంగ్ల ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థి విజయాన్ని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

# పౌరులకు పారదర్శక సేవలే లక్ష్యం



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** పౌరులకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రభుత్వ సేవలు అందించడమే సెవోత్తమ్ కార్యక్రమం లక్ష్యమని జిల్లా అదనపు కలెక్టర్ అంబదాసు రాజేశ్వర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జూనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్ స్థాయి వరకు సిబ్బందికి సెవోత్తమ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రజలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సెవోత్తమ్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సకాలంలో నాణ్యమైన సేవలు అందించడంతో పాటు వారి సమస్యలను వేగంగా పరిష్కరించేలా అధికారులు, సిబ్బంది సామర్థ్యాన్ని పెంపొందించడమే శిక్షణ ఉద్దేశమన్నారు. సెవోత్తమ్‌లో పౌరుల చార్టర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, సేవల అందించే సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి మూడు ప్రధాన అంశాలకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ సేవకు సేవా ప్రమాణాలు నిర్ధారించి, నిర్ణీత గడువులో అందించాలన్నారు. సేవల నాణ్యతను పర్యవేక్షించడం, ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించడం, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడంపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో యూనస్, రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ శంకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి వైపు మహిళలు




**గుండుమాల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో గుండుమాల్‌లో ఉచిత శిక్షణ కొనసాగుతోంది. 30 రోజుల శిక్షణలో 35 మంది మహిళలు వస్త్ర చిత్రకళ, ఎంబ్రాయిడరీ, అల్లికలు, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. వ్యాపార నిర్వహణ, మోటివేషన్, ఇన్సూరెన్స్, టైం మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్నారు. గుండుమాల్, అప్పాయిపల్లి, భోగారం, అమిలికుంట్ల, కోస్గి ప్రాంతాల మహిళలు పాల్గొంటున్నారు. శిక్షణార్థులకు టీ, భోజనం, సామగ్రిని ఉచితంగా అందిస్తున్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని సిబ్బంది చెన్నకేశవ తెలిపారు. మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు.

# కొత్రలో తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత



**వెల్దండ, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్ర గ్రామంలోని ఆరు తాగునీటి నిల్వ ట్యాంకులను బుధవారం శాస్త్రీయ పద్ధతిలో శుభ్రపరిచారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో ప్రత్యేక యంత్రాలతో ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను తొలగించారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాఘవేందర్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద చెన్నయ్య, డిప్యూటీ సర్పంచ్, ఫౌండేషన్ ప్రతినిధులు, వార్డు సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గౌతాపూర్‌లో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**బాలానగర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** గౌతాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రెండో వార్డులో డ్రైనేజీ పనులకు సర్పంచ్ తాళ్ల ప్రకాష్‌గౌడ్ బుధవారం శంకుస్థాపన చేశారు. పారిశుద్ధ్య సమస్య పరిష్కారంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు పనులు చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ యాదయ్య, కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామీణ స్థాయికి న్యాయ సేవలను చేర్చడమే లక్ష్యం



**మూసాపేట్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** గ్రామీణ ప్రజలకు న్యాయ సేవలను చేరువ చేయడమే లక్ష్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు తెలిపారు. మూసాపేట్‌లో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సమస్యలను గొడవలకు దారితీయకుండా రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. పారా లీగల్ వాలంటీర్లు సమస్యలను గుర్తించి ప్రాథమిక దశలో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు, సీనియర్ సిటిజన్ల హక్కులు, రోడ్డు ప్రమాదాలు, పోక్సో, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం మహేందర్, పంచాయతీ కార్యదర్శి, న్యాయవాదులు, పీఎల్‌వీలు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలతో వాసవి క్లబ్ గవర్నర్ పర్యటన



**వనపర్తి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్-108A గవర్నర్ కలిమిచర్ల రమేష్ అధికారిక పర్యటన సందర్భంగా వాసవి క్లబ్ వనపర్తి గోల్డ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేద మహిళలకు చీరలు, రాయగడ్డ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, ప్యాడ్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. జెడ్పీ బాలుర పాఠశాలకు లైబ్రరీ బీరువా, బాలికల పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేశారు. శ్రీచైతన్య పాఠశాలలో మొక్కలు నాటి, వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం



**వెల్దండ, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** చేర్యూర్ గ్రామంలో వెల్దండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు బుధవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత, ప్రజారోగ్యం కోసం పనిచేసే కార్మికుల ఆరోగ్యం ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య బృందం కార్మికులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసింది. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంఆర్‌పీఎస్ కొత్తపల్లి మండల కమిటీ ఎన్నిక



**కొత్తపల్లి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** ఎంఆర్‌పీఎస్ కొత్తపల్లి మండల నూతన కమిటీని బుధవారం గుండుమాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గోధుమ బాల కిష్టయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రాములు, అనంతయ్య, రాజు, కొండప్ప, అధికార ప్రతినిధిగా ఇందమూరి కృష్ణను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా నర్సింహ, పార్వతీశ్, కోశాధికారిగా కొండప్ప, కార్యదర్శులుగా చిలక రవి, అంజి, సిద్ధు, భాస్కర్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్‌ను బలోపేతం చేసి మాదిగల హక్కుల సాధనకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## కేజీబీవీల్లో అకౌంటెంట్, ఏఎన్‌ఎం పోస్టులకు దరఖాస్తులు



**కొల్చారం, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మెదక్ జిల్లాలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) అకౌంటెంట్, ఏఎన్‌ఎం పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి ఎస్. రాజు తెలిపారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యా ర్హతలు, ఇతర అర్హతలు, దరఖాస్తు విధానం తదితర పూర్తి వివరాల కోసం సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు.

## రైలు కిందపడి యువకుడి మృతి



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మండలంలోని మిర్జాపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు కిందపడి శాలిపేటకు చెందిన సత్యనారాయణ (32) మృతి చెందాడు. బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడి తండ్రి యాదగిరి, భార్య పదేళ్ల క్రితమే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తల్లి, కుమార్తెతో కలిసి సత్యనారాయణ జీవిస్తున్నాడని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న కామారెడ్డి రైల్వే పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కామారెడ్డికి తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## జనంసాక్షి వార్తకు స్పందన

- **పశు వైద్య ఆరోగ్య ఉపకేంద్రంపై తెలంగాణ ప్రభుత్వ బోర్డు ఏర్పాటు**



**మల్దకల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం మద్దెలబండ గ్రామంలోని పశువైద్య ఆరోగ్య ఉపకేంద్రం పై తెలంగాణ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. జనంసాక్షి దినపత్రికలో తెలంగాణ వచ్చిన ఇంకా ప్రభుత్వ కార్యాలయంపై ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అని బోర్డును ఉండగా జనంసాక్షి దినపత్రికలో వార్త కథనానికి అధికారులు స్పందించి కొత్త బోర్డును ఏర్పాటు చేశారు.

## డిగ్రీ సెమిస్టర్ ఫీజులు తగ్గించాలి




**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** డిగ్రీ సెమిస్టర్ ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం నారాయణపేటలోని శ్రీ చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట నిరసన చేపట్టారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా సెమిస్టర్ ఫీజులు పెంచుతున్నారని ఆరోపించారు.

విద్యార్థుల నుంచి రూ.200 బయోమెట్రిక్ ఫీజు, ఒక్కో సబ్జెక్టుకు రూ.300 రీకౌంటింగ్ ఫీజు వసూలు చేయడం సరికాదన్నారు. అధిక ఫీజులతో విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. ఫీజులను వెంటనే తగ్గించకపోతే విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలేజీ కమిటీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే రీసర్వే లక్ష్యం

- **ప్రతి భూమికి భూధార్ నంబర్..**
- **ఎల్‌పీఎం ద్వారా హక్కులు, సరిహద్దుల స్పష్టత**

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** రైతుల భూముల హక్కులు, సరిహద్దులు, విస్తీర్ణాన్ని స్పష్టంగా నమోదు చేసి భవిష్యత్ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే రీసర్వే చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రియాంక తెలిపారు. మాగనూరు మండలం గజరాందొడ్డి గ్రామంలో నిర్వహించిన రీసర్వే గ్రామసభలో ఆమె మాట్లాడారు. దాదాపు వందేళ్ల తర్వాత ప్రభుత్వం భూముల రీసర్వే చేపడుతోందన్నారు.

ప్రతి భూమికి భూధార్ నంబర్ కేటాయించి, ఎల్‌పీఎం ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అనంతరం రైతులకు పాస్‌బుక్‌లు అందిస్తామని తెలిపారు. భూముల సరిహద్దులు, రికార్డులు, విస్తీర్ణంలో ఉన్న తేడాలను పరిశీలించి స్పష్టంగా నమోదు చేస్తామన్నారు. రీసర్వే ద్వారా ఎవరి భూమినీ తగ్గించడం, పెంచడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

సర్వేయర్లు గ్రామానికి వచ్చినప్పుడు రైతులు తప్పని సరిగా అందుబాటులో ఉండి తమ భూముల సరిహద్దులను చూపించాలని కలెక్టర్ కోరారు. గజరాందొడ్డిలో సుమారు 450 ఎకరాల భూమి ఉన్నందున రోజుకు 30 ఎకరాల చొప్పున 15 నుంచి 20 రోజుల్లో సర్వే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సర్వే నంబర్‌కు ముందస్తు కార్యాచరణ రూపొందించి, సర్వే తేదీలను రైతులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు.

రీసర్వే అనంతరం రైతుల సమక్షంలో భూమి విస్తీర్ణం, సరిహద్దులు, నమోదైన వివరాలను స్పష్టంగా వివరించాలని తెలిపారు. రైతులకు అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, త్వరలో ఏర్పాటు చేయనున్న టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. రీసర్వే విజయవంతానికి రైతులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరారు.



అనంతరం గ్రామస్తులు అంగన్‌వాడీ భవనం, ఇతర మౌలిక వసతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం. రాములు, తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్, ఎంపీడీవో, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, ఇతర శాఖల అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 33 ఏళ్ల సేవలకు సెల్యూట్..

### మల్లికార్జున్‌కు ఘన సన్మానం



**మొగుడంపల్లి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** పోలీస్ శాఖలో 33 ఏళ్లపాటు సేవలందించిన హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ చేతుల మీదుగా మల్లికార్జున్‌ను ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. చిరాగ్‌పల్లి ఎస్ఐ వినయ్‌కుమార్‌తో పాటు తోటి సిబ్బంది ఆయనకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. విధి పట్ల అంకిత భావం, నిజాయితీ, క్రమశిక్షణతో ఆయన అందించిన సేవలను అధికారులు, సిబ్బంది కొనియాడారు. పదవీ విరమణ అనంతరం మల్లికార్జున్ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

## బీటీ రోడ్డు కోసం బీజేపీ ధర్నా




**అమరచింత, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** కృష్ణంపల్లి నుంచి చింతిరెడ్డి పల్లి వరకు బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మిట్ట నందిమల్ల వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ ఏళ్లుగా రోడ్డు నిర్మాణం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత పాలకులు పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు వేస్తామని హామీ ఇచ్చి విస్మరించిం దని ఆరోపించారు. మంత్రి వాకిటి శ్రీహరి స్పందించి వెంటనే రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ సిబ్బందికి వైద్య శిబిరం



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా గ్రామపంచాయతీ సిబ్బందికి బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ స్వప్న మాట్లాడుతూ సిబ్బంది తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వివిధ గ్రామాల సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ప్రయోగశాల పరీక్షలు, ఉచిత మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ బిక్కు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం దిష్టిబొమ్మ దగ్ధానికి బీజేపీ యత్నం

- **దగ్ధానికి యత్నం అడ్డుకున్న పోలీసులు**



**చేర్యాల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** సీఎం రేవంత్‌రెడ్డి హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేర్యాల అంగడిబజార్‌లో దిష్టిబొమ్మ దగ్ధానికి యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో నాయకులు, పోలీసుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. బీజేపీ మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు గౌడ్ మాట్లాడుతూ వ్యాఖ్యలను ఖండించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అంకుగారి శశిధర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కాశెట్టి పాండు, నాయకులు మన్నే సత్యవర్ధన్, తౌట బాలరాజు, బయ్యారపు యాదగిరి, సోగాల మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చైతన్య కళాశాల అద్దె భవనంపై గ్రామస్తుల ప్రశ్నలు



**మహమ్మదాబాద్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** నంచర్ల గ్రామంలోని చైతన్య కళాశాల అద్దె భవనంపై వచ్చిన వార్తల నేపథ్యంలో బుధవారం గ్రామస్తుల సమక్షంలో చర్చ జరిగింది. గ్రామపంచాయతీ సమీపంలోని సమావేశంలో కళాశాల డైరెక్టర్లు జి.గోపాల్‌రెడ్డి, జే.హనుమన్‌జీ, సర్పంచ్ ఎస్. గాయత్రిదేవి, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. భవనం అద్దె ఒప్పందం, మోటేషన్, విద్యుత్ మీటర్ కోసం సమర్పించిన పత్రాలపై గ్రామస్తులు ప్రశ్నలు లేవనెత్తారు. కళాశాల ఉపాధ్యక్షుడు కె.ఎం.నారాయణ మాట్లాడుతూ విద్యుత్ మీటర్ అవసరాల కోసమే పత్రాలు వినియోగించామని, ఆస్తి బదలాయింపు లేదా యాజమాన్య హక్కుల మార్పు జరగలేదన్నారు. మొదటి ఐదేళ్లు మరమ్మతుల బాధ్యతతో అద్దె లేకుండా భవనం వినియోగించుకునేలా ఒప్పందం జరిగిందని, అనంతరం అద్దె చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. గ్రామ కార్యదర్శి శ్యామ్ మాట్లాడుతూ మోటేషన్ ఆస్తి బదలాయింపు కాదని, పూర్తి వివరాలు తెలుసుకునేందుకు సమయం కోరినట్లు తెలిపారు. భవిష్యత్‌లో వివాదాలు తలెత్తకుండా రికార్డుల్లో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని గ్రామస్తులు సూచించారు.

### పీఏసీఎస్ ద్వారా

## నాణ్యమైన వరి విత్తనోత్పత్తిపై అవగాహన



**మాగనూరు, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** నాబార్డ్ నిధులతో నిర్వహిస్తున్న ప్రాజెక్టులో భాగంగా మాగనూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులు, సిబ్బందికి నాణ్యమైన వరి విత్తనోత్పత్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీఆర్‌వీకే నారాయణపేట కోఆర్డినేటర్ డా. ఈటెల సత్యనారాయణ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనోత్పత్తితో రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు స్థానికంగా నాణ్యమైన విత్తనం అందుబాటులోకి వస్తుందన్నారు. ఏడీఎస్‌సీ గద్వాల జె. చంద్రశేఖర్ విత్తన ఎంపిక నుంచి పంట కోత, నిల్వ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కలుపు, తెగుళ్ల నియంత్రణ, ఇతర రకాల మొక్కల తొలగింపు, పంట పర్యవేక్షణపై అవగాహన కల్పించారు. విత్తనోత్పత్తిని వ్యాపార నమూనాగా అభివృద్ధి చేసుకుని స్థిరమైన ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంఏఓ సుదర్శన్, ఏఈఓ అనిల్, సీఈఓ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్‌లో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం



**తూప్రాన్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** సంతాన సమస్యలతో బాధపడుతున్న దంపతులకు అవగాహన కల్పించడంతో పాటు ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహించారు. సుష్మ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హెగ్డే ఫెర్టిలిటీ సహకారంతో వివేకానందనగర్ కాలనీ, హైస్కూల్ ఎదురుగా శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని నాచారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు సంతాన సమస్యలకు సంబంధించిన వివిధ అంశాలపై దంపతులకు అవగాహన కల్పించారు. మొదటి స్కాన్, వైద్య సంప్రదింపు, ఏఎంహెచ్ పరీక్ష వంటి సేవలు అందించారు. ఐయూఐ తదితర చికిత్సా విధానాలపై వివరించారు.

సుష్మ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ ప్రదీప్ సింహ, సుష్మాదేవి, తేజశ్రీ మాట్లాడుతూ సంతాన సమస్యలకు ఆధునిక వైద్య విధానాలతో చికిత్స అందుబాటులో ఉందన్నారు. ఐయూఐ, ఐవీఎఫ్, ఐసీఎస్ఐ, పీజీటీ, ల్యాప్రోస్కోపీ, హిస్టెరోస్కోపీ వంటి చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. సంతాన సమస్యలను దాచిపెట్టకుండా సకాలంలో నిపుణులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెగ్డే ఫెర్టిలిటీ వైద్యులు తేజశ్రీ, డాక్టర్ సుష్మాదేవి, మార్కెటింగ్ మేనేజర్ ప్రశాంత్, సిస్టర్ అనూష, తూప్రాన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ జానకిరామ్ సీఆర్, కార్యదర్శి పల్లెర్ల బాలేష్ గుప్త, కోశాధికారి పచ్చిమట్ల మల్లేష్ గౌడ్, లయన్ పుట్ట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన పోలీసులకు వీడ్కోలు




**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** సుదీర్ఘకాలం నిబద్ధత, క్రమశిక్షణతో సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ పొందిన అశోక్ సూపరింటెండెంట్, జహీరుద్దీన్ ఆర్ఎస్ఐ, ఎం. మల్లేశం హెడ్ కానిస్టేబుల్, పి.అశోక్ కానిస్టేబుళ్లను ఎస్పీ, అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వారి సేవలను ప్రశంసించిన ఎస్పీ, ఉద్యోగుల విజయానికి కుటుంబ సభ్యుల సహకారం కీలకమన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖసంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. పోలీసుశాఖ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ విధుల బహిష్కరణ



**చేర్యాల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** న్యాయవాదిపై జరిగిన దాడిని ఖండిస్తూ చేర్యాల బార్ అసోసియేషన్ సభ్యులు బుధవారం కోర్టు విధులను బహిష్కరించారు. న్యాయవాదిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరేళ్ల వీరమల్లయ్య మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు భూమిగారి మనోహర్, బురుగు యాదగిరిగౌడ్, పొన్నం సురేష్, సుద్దాల రమేష్, గుస్క వెంకటేశం, తాటికొండ ప్రణీత్, నల్లగొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణంలో కీలకం



**నంగునూరు, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణంలో కీలకమని విశ్రాంత సిద్దిపేట డీఈఓ ఎల్లంకి శ్రీనివాసరెడ్డి అన్నారు. వెంకటాపూర్ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పరకాల విష్ణువర్ధన్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత పెంపొందించడంలో ఆయన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు విద్యాధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడి

### మూడు ట్రాక్టర్లు పట్టివేత

**ఉప్పునుంతల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు బుధవారం తెల్లవారుజామున మొల్గర శివారులోని దుందుభి వాగు వద్ద పట్టుకున్నారు. రాత్రి 1.30 గంటల సమయంలో సమాచారం అందడంతో బ్లూకోల్ట్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. రెండు ట్రాక్టర్లలో ఇసుక లోడ్ ఉండగా, మరోటి ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్ల వద్ద అనుమతి పత్రాలు లేవని పోలీసులు తెలిపారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ, ఎస్‌హెచ్ఓ పి.మహేష్ తెలిపారు. దుందుభి వాగు పరిసరాల్లో నిఘా కొనసాగుతుందన్నారు.

# ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్తు



**హత్నూర, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని మోటివేషన్ స్పీకర్ లోకనాథం సూచించారు. బోర్పట్ల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ప్రత్యేక మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఆత్మవిశ్వాసం, లక్ష్యసాధన, సమయపాలన, జ్ఞాపకశక్తి పెంపు, పరీక్షలపై సానుకూల దృక్పథం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికతో చదవాలని సూచించారు. పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని తెలిపారు.

## తూమోజు నారాయణచారి జయంతి వేడుకలు



**కోహెడ, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ తూమోజు నారాయణచారి 115వ జయంతి వేడుకలను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, సాయి కృష్ణ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. భూషణం గుట్టల్లో రజాకార్ల దాడిలో నారాయణచారి అమరుడయ్యారని రాజు పేర్కొన్నారు. ఆయన చరిత్రను పదో తరగతి పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# వృద్ధుల్లో నిండిన ఉత్సాహం!



**గద్వాల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గద్వాల్ జిల్లా కేంద్రంలో వయోవృద్ధుల వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం స్థానిక 'ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్'లో వృద్ధులకు ప్రత్యేకంగా క్యారమ్స్, చెస్ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మారుతున్న కాలంలో వయోవృద్ధులు ఒంటరితనానికి గురికాకుండా, వారిలో దాగివున్న ఉత్సాహాన్ని వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఆటలు ఆడటం ద్వారా వారి శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, వృద్ధాప్యంలో ఇటువంటి కార్యక్రమాలు వారికి ఎంతో ఉపశమనాన్ని ఇస్తాయని తెలిపారు. ఈ క్రీడల్లో కేంద్రంలోని వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని గడిపారు.

# పొలం వివాదంతో ఇరువర్గాల ఘర్షణ

### పలువురికి గాయాలు



**గద్వాల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** పట్టణంలోని రాతిబురుజు సమీపంలో బుధవారం పొలం హద్దుల వివాదంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. కొత్తపల్లి గ్రామానికి చెందిన రెండు కుటుంబాల మధ్య కొంతకాలంగా పొలం హద్దుల విషయంలో తగాదా కొనసాగుతోంది. బుధవారం పొలం వద్ద ఇరువర్గాలు మాటామాటా పెరగడంతో కర్రలు, రాళ్లతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గాయపడిన వారిని చికిత్స కోసం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# హెచ్‌సీఏ అండర్-15 ప్రాబబుల్స్‌లో శ్రీనిధికి చోటు



**నారాయణపేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** బ్రిలియంట్ గ్రామర్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న క్రికెట్ క్రీడాకారిణి జె. శ్రీనిధి హెచ్‌సీఏ అండర్-15 బాలికల రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సాగర్, వైస్ ప్రిన్సిపాల్ రవి బుధవారం శ్రీనిధిని సన్మానించి అభినందించారు. చిన్న వయసులోనే క్రికెట్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఎంపికకు చేరుకోవడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, నారాయణపేట క్రికెట్ వర్గాలు హర్షం వ్యక్తం చేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమన్నారు. శ్రీనిధి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు, తల్లిదండ్రులకు, నారాయణపేటకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆమె విజయం ఇతర బాలికలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# చట్టాలపై అవగాహనతోనే సత్వర న్యాయం



**కృష్ణ, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటేనే సత్వర న్యాయం దక్కుతుందని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ముడుమాల్ గ్రామంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవివక్ష, అంటరానితనం, అసమానతలను పూర్తిగా నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలను చైతన్యపరిచి అభివృద్ధి వైపు నడిపించేందుకు పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో ప్రతి నెల చివరి రోజున పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నవీద్, పంచాయతీ కార్యదర్శి, సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, సర్పంచ్ బాలరాజ్, జీపీఓ, వార్డు సభ్యులు దండు రాఘవేంద్ర, తిమ్మప్ప, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో 250 మొక్కలు



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** నారాయణఖేడ్ టీజీఎస్ఆర్టీసీ బస్‌డిపోలో వృక్ష మిత్ర ఆధ్వర్యంలో 250 మొక్కలు నాటేందుకు నిర్ణయించారు. మెదక్ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెయింటెనెన్స్) బి.వెంకటేశ్వరరావు చొరవతో కార్యక్రమం చేపట్టారు. డిపోలో పనిచేసే ప్రతి ఉద్యోగి ఒక్కో మొక్కను నాటి సంరక్షించేలా కార్యాచరణ రూపొందించారు. శ్రీగంధం, ఎర్రచందనం, మామిడి, వెదురు, టేకు, వేప, రావి, కానుగ తదితర రకాల మొక్కలను నాటనున్నారు. డీఆర్ఎం మధుసూదన్, డిపో మేనేజర్ సాయి సుబ్రహ్మణ్యం, విక్రమ్ రాథోడ్ పాల్గొన్నారు. అటవీశాఖ సహకారం అందిస్తామని డీఎఫ్ఓ అరవింద్ హామీ ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

# పుస్తకమే విద్యార్థినులకు గొప్ప ఆయుధం

• **చదువుతోనే ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వాతంత్ర్యం: కలెక్టర్ ప్రియాంక**



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** పుస్తకమే విద్యార్థినులకు గొప్ప ఆయుధమని, కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి మంచి ఉద్యోగాలు పొందాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. చదువుతోనే ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వాతంత్ర్యం సాధ్యమవుతాయని, ఎవరి మీదా ఆధారపడకుండా సొంత కాళ్లపై నిలబడేలా ఇప్పటి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని అన్నారు.

బుధవారం మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని ఉట్కూర్ మండల బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, డార్మెటరీ, మరుగుదొడ్లు, వంటగది, స్టోర్‌రూమ్‌లను పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉన్న పల్లీలు, ఇతర నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించి, విద్యార్థినులకు అందించే ఆహారంలో నాణ్యతకు రాజీ పడొద్దని, నాణ్యమైన సరుకులనే వినియోగించాలని సిబ్బందిని ఆదేశించారు.

అనంతరం తరగతి గదుల్లో విద్యార్థినులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి చదువు ప్రగతిని తెలుసుకున్నారు. పలు ప్రశ్నలు అడిగి విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించారు. చదువుపై పూర్తి దృష్టి సారించి, ప్రతి రోజూ కొత్త విషయాలు నేర్చుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలు కష్టపడి చదివితే భవిష్యత్తులో సొంత కాళ్లపై నిలబడే అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. ఏ ఉద్యోగం సాధించాలనే దానిపై ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించుకుని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.

విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి వాతావరణం, అవసరమైన సౌకర్యాలు అందేలా అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థినులను సొంత పిల్లలుగా భావించి వారి విద్యాభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినులకు సూచించారు. కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ కమిషనర్ రాజయ్య, గురుకుల పాఠశాల, కళాశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

### మొక్కజొన్న గింజలపై
# ట్రాక్టర్ నడిపారని ప్రశ్నించినందుకు దాడి

• **కత్తితో ముగ్గురిపై యువకుడి దాడి**







**నవాబుపేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మొక్కజొన్న గింజలపై ట్రాక్టర్ నడపడాన్ని ప్రశ్నించినందుకు ఓ యువకుడు కత్తితో ముగ్గురిపై దాడి చేసిన ఘటన వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మల్కాపురంలో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన కంకట్ల లక్ష్మమ్మ (44), ఆమె కుమారుడు శివకుమార్ గ్రామంలోని కొండపై దేవాలయం వాటర్ ట్యాంక్ సమీపంలోని సీసీ రోడ్డుపై మొక్కజొన్న గింజలను ఆరబోశారు. రాత్రి 7.30 గంటలకు అదే గ్రామానికి చెందిన చందు ట్రాక్టర్‌తో వచ్చి గింజలపై నుంచి వాహనం నడిపాడు. దీనిపై శివకుమార్ ప్రశ్నించడంతో చందు దుర్భాషలాడి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత కత్తితో తిరిగి వచ్చిన చందు శివకుమార్‌పై దాడి చేయడంతో కుడి భుజం, ఎడమ కణతకు గాయాలయ్యాయి. అడ్డుకునేందుకు ప్రయత్నించిన చాకలి హరికృష్ణపై దాడి చేయడంతో కుడిచేతికి, కుమ్మరి రాఘవేందర్‌పై దాడితో ఎడమవైపు గాయాలయ్యాయి. అనంతరం నిందితుడు పరారయ్యాడు. బాధితురాలు లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు.

### ఎస్.ఐ.ఆర్-2026 పై
# అదనపు కలెక్టర్ హరిప్రియ సమీక్ష



**జడ్చర్ల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** 75-జడ్చర్ల నియోజకవర్గ ఈఆర్ఓ, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరి ప్రియ బుధవారం జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) - 2026 పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 30 నాటికి నియోజకవర్గంలో 96.79 శాతం నోటీసుల పంపిణీ, 65.59 శాతం విచారణలు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన విచారణలను గడువులోగా పూర్తి చేస్తామన్నారు. ఏఈఆర్ఓ లాగిన్లలో ఉన్న ఫారమ్-6, 7, 8 పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నోటీసుల పంపిణీ, విచారణల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తెలపాలని, ఎస్.ఐ.ఆర్-2026 ప్రక్రియ సజావుగా పూర్తికావడానికి రాజకీయ పార్టీలు, ఓటర్లు సహకరించాలని కోరారు. సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్-ఏఈఆర్ఓ, అదనపు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఎలక్షన్ డిటి తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా వ్యాప్తంగా
# నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్

• **జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**



**సంగారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 30(జనంసాక్షి):** శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 1వ తేదీ నుండి 31 వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజాధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు చేపట్టకూడదని హెచ్చరించారు.

ఇట్టి విషయంలో జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసు వారికి సహకరించవలసిందిగా ఎస్పీ సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ, అంతర్రాష్ట్ర, గ్రామీణ రహదారుల్లో సమస్యలను గుర్తించి త్వరగా పరిష్కరించాలని సూచించారు. జాతీయ రహదారిపై పెండింగ్ భద్రతా పనులను వేగంగా పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను ఆదేశించారు. టోల్‌ప్లాజాలు, హోటళ్ల వద్ద సర్వీస్ రోడ్లపై అక్రమ పార్కింగ్‌ను నియంత్రించాలని, మలుపులు, చీకటి ప్రాంతాల్లో అదనపు లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అంబులెన్స్, పెట్రోలింగ్, టోల్‌ఫ్రీ సేవలు సమర్థంగా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

ఎర్రవల్లి ఎక్స్‌రోడ్ వద్ద జోగులాంబ గద్వాల జిల్లా దిశను, అలంపూర్ శ్రీ జోగులాంబ ఆలయానికి వెళ్లే దిశ, దూరాన్ని సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాయచూర్, అయిజ, గట్టు, ఎర్రవల్లి రహదారులను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను సూచించారు. రాజోలి మండలానికి భారత్ మాల హైవేతో అప్రోచ్ రోడ్డుకు ప్రతిపాదన సిద్ధం చేయాలన్నారు.

అతివేగం, డ్రంక్ డ్రైవింగ్, అక్రమ పార్కింగ్‌ను కట్టడి చేసేందుకు నిరంతర పెట్రోలింగ్ చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సులను నిర్దేశిత బస్‌స్టాప్‌లలోనే నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైవేలు, గ్రామీణ రహదారుల వద్ద వైన్‌షాపులను ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేయాలని, పార్కింగ్, పరిసరాల పరిశుభ్రతపై నిఘా పెట్టాలని సూచించారు. ఆర్టీఓ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ శంకర్, ఆర్‌అండ్‌బీ ఈఈ ప్రగతి, డీటీఓ రాధిక, ఆర్టీసీ డీఎం శ్రీధర్, ఎన్‌హెచ్‌ఏఐ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

• **విద్యార్థులు లక్ష్యంతో చదవాలి: మధుసూదన్ నాయక్**







**భూత్పూర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):**
భూత్పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు.

అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వారి చదువు, విద్యా ప్రగతి, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలపై విద్యార్థుల అవగాహనను ప్రశ్నల ద్వారా పరిశీలించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో కష్టపడి చదవాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. సరైన ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని విద్యార్థులకు సూచించారు.

పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా పారిశుధ్య చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులను ఆదేశించారు. శానిటేషన్ పనుల్లో నిర్లక్ష్యం లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే రీసర్వే లక్ష్యం

**ప్రతి భూమికి భూధార్ నంబర్.. ఎల్‌పీఎం ద్వారా హక్కులు, సరిహద్దుల స్పష్టత**





**మాగనూరు, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** రైతుల భూముల హక్కులు, సరిహద్దులు, విస్తీర్ణాన్ని స్పష్టంగా నమోదు చేసి భవిష్యత్ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే రీసర్వే చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రియాంక తెలిపారు. మాగనూరు మండలం గజరాందొడ్డి గ్రామంలో నిర్వహించిన రీసర్వే గ్రామసభలో ఆమె మాట్లాడారు. దాదాపు వందేళ్ల తర్వాత ప్రభుత్వం భూముల రీసర్వే చేపడుతోందన్నారు.

ప్రతి భూమికి భూధార్ నంబర్ కేటాయించి, ఎల్‌పీఎం ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అనంతరం రైతులకు పాస్‌బుక్‌లు అందిస్తామని తెలిపారు. భూముల సరిహద్దులు, రికార్డులు, విస్తీర్ణంలో ఉన్న తేడాలను పరిశీలించి స్పష్టంగా నమోదు చేస్తామన్నారు. రీసర్వే ద్వారా ఎవరి భూమినీ తగ్గించడం, పెంచడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

సర్వేయర్లు గ్రామానికి వచ్చినప్పుడు రైతులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి తమ భూముల సరిహద్దులను చూపించాలని కలెక్టర్ కోరారు. గజరాందొడ్డిలో సుమారు 450 ఎకరాల భూమి ఉన్నందున రోజుకు 30 ఎకరాల చొప్పున 15 నుంచి 20 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సర్వే నంబర్‌కు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, సర్వే తేదీలను రైతులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు.

రీసర్వే అనంతరం రైతుల సమక్షంలో భూమి విస్తీర్ణం, సరిహద్దులు, నమోదైన వివరాలను స్పష్టంగా వివరించాలని తెలిపారు. సమస్యలు, అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, త్వరలో ఏర్పాటు చేయనున్న టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. రీసర్వే విజయవంతానికి రైతులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరారు.

అనంతరం గ్రామస్తులు అంగన్‌వాడీ భవనం, ఇతర మౌలిక వసతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం. రాములు, తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్, ఎంపీడీవో శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, ఇతర శాఖల అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### భూముల రీ సర్వేతో

# రైతులకు మేలు: అదనపు కలెక్టర్ శ్రీను



**కృష్ణ, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** భూముల రీ సర్వే చేయడం వల్ల రైతులకు ఇబ్బందులు తొలగి అనేక ప్రయోజనాలు చేకూర్తాయని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను తెలిపారు. బుధవారం కృష్ణ మండలం ముడుమల్ దొడ్డి, గ్రామంలో జరిగిన గ్రామ సభకు అదనపు కలెక్టర్ హాజరై యొక్క ప్రాముఖ్యత ప్రయోజనాలను రైతులకు వివరించారు. రీ సర్వే చేయడం వల్ల భూముల ఇబ్బంది ఉండ దని రైతులకు తెలిపారు. సర్వేయర్ లు, సకాలంలో పూర్తిచేసి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ శ్రీనివాస్, ఆర్ ఐ శ్రీశైలం, సర్వేయర్ లు, జిపిఓ, పంచాయతీ కార్యదర్శి రాజు, సర్పంచ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాల్‌కల్ తహసీల్దార్ ప్రభువులకు వీడ్కోలు



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** న్యాల్‌కల్ తహసీల్దార్‌గా 16 నెలలు పనిచేసిన ప్రభువులు బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా అక్టోబర్ 1న మధ్యాహ్నం 12 గంటలకు ముంగి శివారులోని ఎస్ఎల్ఆర్ ప్రాంగణంలో వీడ్కోలు సభ నిర్వహించనున్నట్లు సిబ్బంది తెలిపారు. 39 ఏళ్ల సర్వీసులో పటాన్‌చెరు, రామచంద్రాపురం, జహీరాబాద్, వట్‌పల్లి, కౌడిపల్లి, ఝరాసంఘం, రాయికోడ్, న్యాల్‌కల్‌లో తహసీల్దార్‌గా సేవలందించారు. కార్యక్రమానికి జహీరాబాద్ ఆర్డీవో దేవుజా, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నారు.

## సేరిగూడలో డ్రైనేజీ పనులకు శ్రీకారం



**బాలానగర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** పెద్దయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సేరిగూడ 5వ వార్డులో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ గాయత్రి లక్ష్మయ్య బుధవారం ప్రారంభించారు. మల్లారెడ్డి ఇంటి నుంచి అంగన్‌వాడీ పాఠశాల వరకు డ్రైనేజీ నిర్మాణంతో మురుగునీటి సమస్య పరిష్కారమై పరిసరాలు పరిశుభ్రంగా మారుతాయని తెలిపారు. గ్రామ అభివృద్ధే ధ్యేయంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా దశలవారీగా పనులు చేపడతామని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి కీలక అడుగు



**మల్దకల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** పెద్దపల్లి గ్రామపంచాయతీలో విబిజి రాంజీ కార్యక్రమంలో భాగంగా బుధవారం విలేజ్, రిసోర్స్ మ్యాప్‌ల ద్వారా 375 అభివృద్ధి పనులను గుర్తించారు. గ్రామంలో చేపట్టాల్సిన పనులు, ఉపాధి అవకాశాలు, వనరుల వినియోగంపై అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించారు. సర్పంచ్ అల్వాల రాజశేఖర్‌రెడ్డి, టీఏ అనూష, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, వెటర్నరీ డాక్టర్ ఉష పాల్గొన్నారు. గ్రామస్తులు, సిబ్బంది హాజరయ్యారు.

## అల్లీపూర్‌కు 25 ఎల్ఈడీ లైట్లు



**శివ్వంపేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** అల్లీపూర్ గ్రామానికి మంత్రి దామోదర్ రాజ నర్సింహ ప్రోత్సాహంతో యువ నాయకుడు బొమ్మిడాల శంకర్ ఆధ్వర్యంలో 25 ఎల్ఈడీ లైట్లు అందజేశారు. సర్పంచ్ చింతకాయల కుమార్‌కు వాటిని అందించారు. గ్రామాల్లో వీధి దీపాల సమస్య పరిష్కారానికి ఇవి ఉపయోగపడతాయని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బుర్ర మురళిగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిన్నకృష్ణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నైపుణ్యం ఉంటే నగరాల్లో కొలువు: జపా మేడ్‌లకు భలే డిమాండ్

- **ఆర్‌సేటీలో జపా మేడ్ శిక్షణ ప్రారంభించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి**





**వనపర్తి, బ్యూరో సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** నైపుణ్యాలు పెంపొందించుకొని జపా మేడ్‌లుగా శిక్షణ పొందిన మహిళలకు ప్రస్తుత పరిస్థితుల్లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం వనపర్తిలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సేటీ) ఆధ్వర్యంలో మహిళల కోసం నిర్వహిస్తున్న జపా మేడ్ కోర్సు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఒక మహిళకు బిడ్డ పుట్టిన తర్వాత మొదటి నలభై రోజుల కాలాన్ని జపా కాలంగా పిలుస్తారని చెప్పారు. ఈ సమయంలో తల్లి, శిశువుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని, వారి బాగోగులు చూసుకునే కేర్‌టేకర్లనే జపా మేడ్‌లు అంటారని వివరించారు.

నైపుణ్యం కలిగిన జపా మేడ్‌లకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, ముఖ్యంగా పెద్ద నగరాల్లో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేసే కుటుంబాలు పెరుగుతున్న నేపథ్యంలో, తల్లీశిశు సంరక్షణ కోసం అనుభవజ్ఞులైన కేర్‌టేకర్ల సేవలకు గిరాకీ ఏర్పడిందని పేర్కొన్నారు.

ఏఐ, రోబోల ద్వారా అనేక పనులు జరుగుతున్నప్పటికీ, తల్లీబిడ్డల సంరక్షణ వంటి సేవలను ఏ సాంకేతికతా భర్తీ చేయలేదని, అందువల్ల ఈ రంగానికి ఎప్పటికీ డిమాండ్ ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. జపా మేడ్ వృత్తి ఒక ముఖ్యమైన ఉపాధి మార్గంగా మారుతోందన్నారు.

జిల్లా కేంద్రంలో ఆసక్తి ఉన్న మహిళలకు ఆర్‌సేటీ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇవ్వడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. ఇరవై రోజుల పాటు సాగే ఈ శిక్షణలో అభ్యర్థులు పూర్తిస్థాయిలో పాల్గొని అవసరమైన నైపుణ్యాలు నేర్చుకోవాలని సూచించారు. ఈ వృత్తిలో రాణించాలంటే సేవాభావం, ఆసక్తి, ఓర్పుతో పాటు నైపుణ్యాలు కూడా అవసరమని తెలిపారు. మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి అవకాశాలు పొందాలని కోరారు.

శిక్షణ విజయవంతంగా పూర్తయిన అనంతరం, నగరాల్లోని వివిధ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం ద్వారా చర్యలు చేపట్టే ప్రయత్నం చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో రామ మహేశ్వర్ రెడ్డి, ఎల్‌డీఎం శివకుమార్, ఆర్‌సేటీ డైరెక్టర్ అనిల్ కుమార్, ఏపీఎం సరోజ, నర్సింగ్ కళాశాల ఫ్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు.

# డోకూరులో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు





గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను గుర్తించి పంచాయతీ సమావేశాల్లో తీర్మానాలు చేసి అమలు చేయాలని సూచించారు. డ్రైన్లు, రోడ్లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దోమలు, ఈగల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరును పరిశీలించిన కలెక్టర్.. అనుమతి లేకుండా తెలుగు ఉపాధ్యాయుడు విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. దీనిపై సాయంత్రంలోపు నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా శ్రద్ధగా చదవాలని సూచించారు. అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూను పరిశీలించి విద్యార్థులకు పోషకాహారం అందించాలని సూచించారు.

ప్రాథమిక పాఠశాలలోనూ ఉపాధ్యాయుల హాజరు, విద్యాబోధనను పరిశీలించారు. బోధనలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం మూసి ఉండటాన్ని గమనించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీచర్ కొన్ని రోజులుగా విధులకు హాజరు కావడం లేదని తెలియడంతో సంబంధిత టీచర్, సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారిని ఆదేశించారు.

కేజీబీవీలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను పరిశీలించి నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలని సూచించారు. వంటగది, స్టోర్‌రూమ్, డైట్ మెనూ, కూరగాయల నిల్వ, పరిశుభ్రతను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర వసతులపై ఆరా తీశారు. ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా మహిళ గురుకుల కళాశాలలో ప్రెషర్స్ డే

**శామీర్ పేట్, సెప్టెంబర్ 30(జనం సాక్షి ) :** శామీర్ పేట్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం రోజున ఘనంగా మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు . ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఇష్రత్ మాట్లాడుతూ.. డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులు కళాశాలలో ప్రవేశించినందుకు శుభా కాంక్షలు తెలియజేస్తూ జీవితంలో ఉన్నత లక్ష్యా లను సాధించి కాలేజీ పేరును మరియు వారి యొక్క తల్లిదండ్రుల పేరుని నిలబెట్టాలని తెలియ జేశారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ అండ్ సెకండ్ ఇయర్ స్టూడెంట్స్ ఆట పాటలతో అలరించారు. ఈ కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా ఇష్రత్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డా. స్రవంతి,అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ ఎం.గీత, కల్చరల్ కోఆర్డినేటర్ ధనవేణి, మమత అధ్యాపక బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే లక్ష్యం

### కీసర పీఏసీఎస్ మహాజనసభలో అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి



**కీసర, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని కీసర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కీసరలోని సంఘ కార్యాలయ ఆవరణలో ఆయన అధ్యక్షతన మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కార్యకలాపాలు, రైతులకు అందుతున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. రైతులకు అవసరమైన సేవలను మరింత సమర్థంగా అందించేందుకు కృషి చేస్తామని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సంఘం అభివృద్ధికి రైతులు, పాలకవర్గం సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు పన్నాల బుచ్చిరెడ్డి, డైరెక్టర్లు మాలోత్ ధర్మా, మచ్చాని మల్లేష్, కందాడి పోచిరెడ్డి, కౌకుట్ల చిన్న అంజిరెడ్డి, కామసాని మల్లారెడ్డి, మాదిరెడ్డి భూపాల్‌రెడ్డి, సీఈఓ రామిడి శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతులు పాల్గొన్నారు.

## నిమజ్జనం ప్రశాంతం.. ఎస్‌హెచ్‌వోకు సన్మానం

### రేయింబవళ్లు విధులు నిర్వహించిన చర్లపల్లి పోలీసులు

### ఎస్‌హెచ్‌వో సుధాకర్‌ను అభినందించిన యంగ్ వర్కర్స్ జిల్లా కన్వీనర్ మణికంఠ



**కీసర, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిన సందర్భంగా చర్లపల్లి ఎస్‌హెచ్‌వో సుధాకర్‌ను మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా యంగ్ వర్కర్స్ కన్వీనర్ కె ఎస్ ఎస్ మణికంఠ కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి అభినందించారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ఆటంకాలు చోటుచేసుకోకుండా పోలీసులు రేయింబవళ్లు విధులు నిర్వహించారని కొనియాడారు. ఈ సందర్భంగా యువ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి యంగ్ వర్కర్స్ యూనియన్ తరఫున చేస్తున్న కృషిని ఎస్‌హెచ్‌వోకు వివరించారు. సమస్యల పరిష్కారానికి అధికారుల సహకారంతో ముందుకు సాగుతానని మణికంఠ తెలిపారు.

# పంగ శ్రీహరికి నాగారం కాంగ్రెస్ ఎస్సీ సెల్ పగ్గాలు

### డివిజన్ అధ్యక్షుడిగా నియామకం

### పార్టీ బలోపేతానికి కృషి చేస్తా : శ్రీహరి





**కీసర, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** నాగారం డివిజన్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పంగ శ్రీహరి నియమితులయ్యారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, కావలి చంద్రయ్య బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి పంగ శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ, ఎస్సీ సెల్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు.

**అభినందనలు..**

శ్రీహరిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూమయ్య యాదవ్, మాజీ కౌన్సిలర్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంగ హరిబాబు, యువ నాయకుడు కౌకుంట్ల జీవన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్, అనిల్ యాదవ్, చిన్నంరాజ్ సతీష్ గౌడ్, కౌకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, దాసోహం చిన్న (నర్సింగ్ రావు) మామిడ్ల శేఖర్ యాదవ్, కిష్టన్నగారి రవి, పంగ సంతోష్, మణి, ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ.. ఉద్యోగావకాశాలు

### జిల్లా ఉపాధి అధికారి ఎం.రాధిక

### డీడీయూ-జీకేవై పథకం ద్వారా వసతి, భోజనం ఉచితం

### శిక్షణ అనంతరం ఉద్యోగం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులకు డీడీయూ-జీకేవై పథకం కింద ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.రాధిక తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ (ఎస్ఆర్‌టీఐ)లో డీడీయూ-జీకేవై పథకం కింద శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.రాధిక తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ (ట్యాలీ ప్రైమ్), సోలార్ టెక్నీషియన్, ఎలక్ట్రిషియన్, ఆటోమొబైల్ టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, మొబైల్ టెక్నీషియన్-సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, కంప్యూటర్ హార్డ్‌వేర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ (డిజిటల్ మిత్ర) కోర్సుల్లో మూడు నుంచి నాలుగు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నారు.

ఎస్ఎస్‌సీ, ఇంటర్, బీకాం ఉత్తీర్ణులై 18 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సు గల వారు అర్హులు. అక్టోబర్ 5న సంస్థలో హాజరై ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్, కుల ధ్రువపత్రం, ఫొటోలతో రావాలని సూచించారు. దిల్‌సుఖ్‌నగర్, హయత్‌నగర్ ప్రాంతాల నుంచి 524 బస్సు సౌకర్యం ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఎం.రాధిక కోరారు.

## కిసాన్ మేళాలో ఆకట్టుకున్న మినియేచర్ ఆవు

### పశుసంవర్ధక శాఖ స్టాల్‌లో అధిక దిగుబడి విత్తనాలు, మేలు జాతుల ప్రదర్శన





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** మేడ్చల్ కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కిసాన్ మేళాలో పశు సంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ ఆకట్టుకుంది. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో వివిధ రకాల పశుసంవర్ధక ఉత్పత్తులు, పశుగ్రాస విత్తనాలు, మేలు జాతులను ప్రదర్శించారు. ముఖ్యంగా రెండు అడుగుల ఆరు అంగుళాల ఎత్తు ఉన్న మినియేచర్ ఆవు చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. స్టాల్‌లో అధిక దిగుబడినిచ్చే పశుగ్రాస విత్తనాలు, అధిక పాల దిగుబడినిచ్చే ఆవుల జాతులు, అధిక మాంసోత్పత్తినిచ్చే గొర్రెల జాతులు, మేలు జాతి కోళ్లు, బహువార్షిక పశుగ్రాసాలు, చొప్ప కత్తిరించే యంత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులతో పాటు, టీజీవో మేడ్చల్ జిల్లా కార్యదర్శి డా. కురుమూర్తి, టీఎన్జీవో మాజీ కార్యదర్శి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ప్రవీణ్ గౌడ్, డా. నాగరాజు యాదవ్, డా. బలిరాం, డా. తిరుపతి పాల్గొన్నారు.



## యాచారం మండలంలో రూ.6.70 కోట్లతో అభివృద్ధి పనుల జాతర

**యాచారం (జనంసాక్షి) :** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రూ. 6.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధి పనులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి బుధవారం ప్రారంభోత్సవాలు చేశారు. యాచారం గ్రామానికి రూ. 3.60 కోట్లు, తక్కలపల్లికి రూ. 1.10 కోట్లు, కొత్తపల్లికి రూ.కోటి, ధర్మన్నగూడ గ్రామానికి రూ. 20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయిస్తూ మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, సర్పంచ్‌లు మస్కు అనిత శరణం , కొలను రమాదేవి మల్లారెడ్డి , చిక్కుడు వెన్నెల శేఖర్ , నరేందర్ రెడ్డి , పండుగ పద్మావతి బాల్ రాజ్ , మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు బిలకంటి శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం, నాయకులు వరికుప్పల సుధాకర్, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీడీవో విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఏడీ సీతారాం నాయకులు హాజరయ్యారు.